క్లుప్తంగా

పోస్టాఫీసులో జాతీయ జెండాల విక్రయం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు పోస్టు మాస్టర్ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండాలు కావాల్సిన వారు స్థానిక పోస్టాఫీసులో రూ.25 చెల్లించి జెండాను కొనుగోలు చేయాలని కోరారు. www.epostoffice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్‌తో జాతీయ జెండాను ఇంటి వద్దకే పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఐకి సన్మానం



పాన్‌గల్: మండలంలో నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వేణును మంగళవారం రేమద్దుల, శాగాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐని సన్మానించిన వారిలో రంగాపురం శివారెడ్డి, తిరుపతియాద్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బదిలీల్లో ప్రాధాన్యం కల్పించాలి



కొత్తకోట రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో జీఓ నంబర్ 5, 9 స్పౌజ్‌లకు ప్రత్యేకంగా ఇస్తున్న పాయింట్లు ప్రభుత్వం ఉప సంహరించుకుని ఉపాధ్యాయులందని ఒక విధంగా చూడాలంటూ మంగళవారం కొత్తకోట మండలం అమడబాకుల జెడ్పీహెచ్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో తేడాలను తొలగించి అర్థంతరంగా తీసుకొచ్చిన జీఓ నంబర్ 5, 9లను క్రమబద్ధీకరించి స్పౌజ్‌లకు ఇచ్చే పది పాయింట్లు రద్దు పరిచి బదిలీల్లో అందరిని సమానంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, రాధిక, కవిత, శ్రీలత, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జాతీయ నాణ్యతా ప్రమాణాల బృంద సభ్యులు భావిన్ వగాడియా, డాక్టర్ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కల్పిస్తున్న వసతులు, వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెన్నూరు, బుద్దారం ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో క్లైవెన్‌మార్క్, సంజయ్‌బాబు, నాయక్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



పెబ్బేరు రూరల్: స్థానిక బైకు మోటార్ మెకానికుల షెడ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. చాలా ఏళ్లుగా బైకు మోటార్ మెకానిక్ వృత్తిని నమ్ముకొని బతుకుతున్నాం. కాబట్టి పెబ్బేరు పట్టణ కేంద్రంలోని స్థలం కేటాయిస్తే అక్కడ షెడ్లు వేసుకుంటామని మంత్రిని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, రామకృష్ణారెడ్డి, ఉస్మాన్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు చెంచుగూడానికి చెందిన చెంచు మహిళ చెన్నమ్మ సోమవారం పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్ చానల్ దగ్గర అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మంగళవారం బాధిత కుటుంబసభ్యులతో కలిసి ప్రాజెక్టు పనులు చేస్తున్న కంపెనీ కార్యాలయం ఎదుట గిరిజన నాయకులు ధర్నా చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాహకులు కొంతమేర నష్టపరిహారం ఇవ్వడంతో ధర్నా విరమించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెబ్బేరు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అండర్–14, 17 క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ క్రీడలు ద్వారా శరీరానికి కావాల్సిన వ్యాయామం, శారీరక ధృడత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, ఎంఈఓ జయరాములు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రాయిస్ ఫాతిమా, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల పాఠశాల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, జిల్లా యువజన, క్రీడా అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి వరలక్ష్మి, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంత అవసరమని, ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో మెలగాలని వారికి సూచించారు. వివిధ పాఠశాల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో మంచి నైపుణ్యం కనబర్చిన క్రీడాకారులను మండల జట్టుకు ఎంపిక చేశామని హెచ్‌ఎం కురుమయ్య తలిపారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్, శ్రీదేవి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో..

ప్రజలను మభ్యపెట్టడం సాధ్యం కాదు

వనపర్తి: నియోజకవర్గంలో కనిపిస్తున్న అభివృద్ధిని దాచి ప్రజలను మభ్యపెట్టడం సాధ్యం కాదని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ నుంచి ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు సోమవారం నియోజకవర్గంలో చేపట్టిన వాహన ర్యాలీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలకు స్పందించిన ఆయన ప్రకటన విడుదల చేశారు. నమ్ముకున్న వారికి అన్యాయం చేసి.. నయా పైసా లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వారు, కార్యకర్తల బతుకులు కూడా బాగు చేయని నాయకులు జట్టు కట్టి నీతి వ్యాఖ్యలు వల్లించటం ఏమిటని ప్రశ్నించారు. దశాబ్దాలుగా చేయలేని అభివృద్ధిని అతితక్కువ కాలంలో చేసి చూపించిన నాయకుడు మంత్రి నిరంజన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని మండిపడ్డారు.

వాకిటి శ్రీధర్‌కు సన్మానం

వనపర్తి టౌన్: బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌ను మంగళవారం రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల అదనపు జనరల్ సెక్రెటరీ సత్యన్నచారి, జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి అంజయ్య, ఉపాధ్యక్షులు రాంచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, సలహాదారుడు ఎన్. శ్రీనివాసులు, కోశాధికారి ఉపేందర్, కమిటీ సభ్యులు ఎంఎస్ గౌడ్, సత్యనారాయణగౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

ముస్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డికి 10 డిమాడ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పూటల డ్యూటీ వేయడం వల్ల కార్మికులు పది కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని, నాలుగు సార్లు తిరగాల్సి వస్తుందన్నారు. గతంలో మాదిరిగా ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక పూట డ్యూటీ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉండే స్థానిక సమస్యలు పరిష్కరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, కట్ చేసిన డబ్బులు రెగ్యూలర్‌గా జమ చేయాలని, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు అందరికీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు యాదగిరి, మన్యం, మౌలాలి, కుమార్, పద్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుదల

పాన్‌గల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారంతండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టిక హారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు వైద్యుల సూచనలు తప్పక పాటించాలని, ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టిక హారంతో పాటు ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసీయాబేగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలు లేకుండా అందించి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, మాధవి పాల్గొన్నారు.



అన్నారం తండాలో తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్న సర్పంచ్ రంగానాయక్

44వ రోజుకు చేరిన స్వీపర్ల సమ్మె

పెబ్బేరు రూరల్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్వీపర్లు చేపట్టిన సమ్మె మంగళవారం 44వ రోజుకు చేరింది. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో కొనసాగుతున్న దీక్షా శిబిరంలో స్వీపర్లు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వారి పేదరికాన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వం శ్రమ దోపిడికి పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ఖాజపాషా, రషీద్, ఖయ్యూం, బాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.పగిడాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో టీడీపీకి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నెనారాయణ, ఆనంద్, అశయ్య, రామస్వామి, చంద్రయ్య, సుధాకర్, సత్యానారాయణ, జగదీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ ఫలాలు



వనపర్తి: చిన్నంబావి మండలంలోని కొప్పునూరులో నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు ఆదేశానుసారం గడప గడపకు కమలం, గుండె గుండెకు ఎల్లేని కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ మండల స్థాయి ముఖ్య నాయకులతో కలిసి గ్రామంలో ప్రతి గుండెను తట్టారు. దళితులకు డబల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు అందలేదని, దళిత వాడల్లో డ్రైయినేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యాయన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల వద్దకే పాలన తెచ్చి మన పథకాలు మనకే అమలు పరుచుకునే విధంగా పాలన అందిస్తామనిని తెలిపారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుకు జనం బారులు

పాన్‌గల్: సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందించే రూ.3 లక్షలు సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. దరఖాస్తు చేసుకోవడానికి గడువు రెండు రోజులే ఉండడంతో అవసరమగు కులం, ఆదాయం ధ్రువపత్రాలు పొందడానికి జనం నానా అవస్థలు పడుతూ మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలని జనం కోరుతున్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు వచ్చే 'గృహలక్ష్మి' దరఖాస్తులను స్వీకరించేందుకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గృహలక్ష్మి దరఖాస్తులను మహిళల పేరిట చేస్తేనే స్వీకరిస్తారన్నారు. ఖాళీ స్థలం ఉండి సొంత ఇళ్లు లేని మహిళలే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు 400 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

వీపనగండ్లలో..

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు గృహలక్ష్మి పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని పలువురు దరఖాస్తుదారులు మంగళవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలో మంగళవారం నుంచే దరఖాస్తులు తీసుకొని 10వ తేదీన ముగుస్తుందని చెప్పడం సరికాదని, దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం సర్టిఫికెట్ జమ చేయాలని చెబుతున్నారు. కానీ మండలంలో ఇటీవలే నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌కు సంబంధించిన డిజిటల్ సైన్ అప్రూవల్ కాలేదని, దీంతో కులం సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయిందని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గృహలక్ష్మి దరఖాస్తులు అందజేసే తేదీని మరో 10రోజులు పొడగించాలని కోరారు.



పాన్‌గల్ మీసేవా కేంద్రం ఎదుట గుమికూడిన ప్రజలు

కొత్తకోట: మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉండే నిరుపేదలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకానికి అర్హులు ఈనెల 10లోగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అర్హులు తప్పనిసరిగా తమ స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు జతపర్చి మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని, అర్హులను గుర్తించి ఎంపిక చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాలకు చెందిన అర్హులు గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణం కోసం దరకాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన వారు పుర కార్యాలయంలో, గ్రామాలకు సంబంధించిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను ఇవ్వాలన్నారు.



వీపనగండ్లలో గృహలక్ష్మి దరఖాస్తులను అందజేస్తున్న ప్రజలు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని గ్రామాల ప్రజలు గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తు ఫారంతో పాటు 2 పాస్ ఫొటోలు, రేషన్, ఓటర్, ఆధార్ కార్డు, ఇంటి స్థలం దస్తావేజు కాపీ, ఇంటి పన్ను రశీదు, కరెంటు బిల్లు, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు జత చేసి పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిధుల మంజూరుపై హర్షం

కొత్తకోట రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి రైతులు అండగా నిలుస్తారని జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలో రైతుల పొలాలకు వెళ్లేందుకు బాటలు వేసేందుకు రూ.1.35కోట్లు మంజూరు చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డికి జగదీశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యర్థన మేరకు వ్యవసాయ పొలాల బాటలకు వేసేందుకు నిధులు మంజూరు చేయడంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మండలంలో ఎవరికి ఏ కష్టం వచ్చిన నేనున్నాంటూ ముందుకు వచ్చి కష్టాలు తీర్చుతున్న మంత్రికి అన్ని వర్గాల వారు అండగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటస్వామి, నాగేంద్రంయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వనపర్తి టౌన్: మహిళా సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటుగా ఆర్థికంగా పురోగతి సాధించాలని మెప్మా జిల్లా సమన్వయ కర్త బాలరాజు, మెప్మా అధికారులు యువరాజు, సరస్వతి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పుర కార్యాలయంలో జిల్లా కేంద్రానికి చెందిన ఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా రుణాలు తీసుకున్న మహిళలు, తీసుకోవాల్సిన వారి వివరాలపై చర్చించారు. అంతేకాకుండా ఆర్పీలు ఆయా వార్డు పరిధిలో వీధి విక్రయ వ్యాపారులను గుర్తించి వారికి పీఎం స్వానిధి అందేలా చొరువ తీసుకోవాలన్నారు. కొత్తగా వ్యాపారం చేస్తున్న, మిగిలిపోయిన వీధి విక్రయ వ్యాపారులు ఎవరైనా ఉంటే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇది వరకు పీఎం స్వానిధి కింద రుణాలు తీసుకున్న చిరు వ్యాపారులు సక్రమంగా చెల్లించేలా అవగాహన కల్పించడంలో ఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



మాట్లాడుతున్న మెప్మా అధికారులు

నేటి నుంచి విధుల్లోకి పారిశుద్ధ్య కార్మికులు

ఖిల్లాఘనపురం: పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం నుంచి విధుల్లో చేరుతారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా అంజనేయులు, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కార్మిక సంఘాల నాయకులు జరిపిన చర్చలు సానుకూలంగా జరిగాయని ఆయన చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి సముఖంగా ఉన్నందున 9వ తేదీ నుంచి సమ్మెను వాయిదా వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే తిరిగి సమ్మెలోకి పారిశుద్ధ్య కార్మికులు వెళ్తారన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ లక్ష్మీనారాయణ, వెంకటేష్, విజయలక్ష్మి, చిన్నబాలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

పాన్‌గల్: తమ డిమాండ్ల సాధన కోసం 34 రోజులుగా చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ జేఏసీ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం కార్మికుల డిమాండ్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోకపోతే మరో పోరాటానికి కూడా పంచాయతీ కార్మికులు సిద్ధంగా ఉండాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. చివరి రోజు పంచాయతీ కార్మికులకు బీజేపీ, సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న కార్మికులు

చేనేత కార్మికులకు అండగా కేంద్ర ప్రభుత్వం

అమరచింత: కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కల్పన అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం చేనేత కార్మికులకు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత వృత్తి మరుగున పడే ప్రమాదం ఉందని, వీటిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచం మెచ్చుకునే స్థాయిలో చేనేత కార్మికులు జరీ చీరలను అగ్గిపెట్టెలో ఇమిడే విధంగా తయారు చేస్తున్న ఘనత మన తెలుగు వారికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహేశ్వరి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు క్యామ భాస్కర్, చేనేత సొసైటీ ప్రధాన కార్యదర్శి క్యామ శ్రీను, ఉపాధ్యక్షుడు వగ్గు రామలింగం, నరాల సిద్దురాములు, మేర్వ అనిల్, వెంకటేష్, క్యామ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో హజ్రత్ గంధోత్సవం



హజ్రత్‌ల గంధోత్సవంలో పాల్గొన్న ముర్షద్‌లు, భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని హజరత్ సయ్యద్ షా సాహెబ్, హజరత్ సయ్యద్ మౌలాన సాహెబ్‌ల ఉర్సు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి గంధోత్సవాన్ని స్థానిక ఎక్బాల్ బిన్ సయ్యద్ ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా షరీఫ్‌కు చేర్చారు. అనంతరం దీపారాధన, ఖవ్వాలీ కార్యక్రమాలు చేశారు. ప్రముఖ ఖవ్వాలి గాయకుడు హాశం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. వట్టెం షరీఫ్ చిస్తీమిర్జాయి వఖలందరి ముర్షద్ ఖాజబాబా సాహెబ్, మతీన్, ఇస్మాయిల్ సాహెబ్ ముఖ్య అతిథులుగా హాజయ్యారు. బుధవారం ఉదయం 11గంటలకు ఖత్మే ఖురాన్‌ఖాని, ఫాతేహా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎఖ్బాల్ బిన్ సయ్యద్, ఖమర్‌బిన్ సయ్యద్, గయాసుద్దీన్, జావెద్, బాబుమియా, మగ్బూల్, ఫయాజ్, హాశిం, ఇబ్రహీం, రహ్మతుల్లా, సాధిక్, ఫెరోజ్, అజ్మతుల్లా, షోయబ్, రియాజ్‌అలీ, ఇస్మాయిల్, అయూబ్‌ఖాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొడిపీర్లకు ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూర్: పట్టణంలోని రాజ వీధిలోని మసీదులో ప్రతిష్ఠించిన కొడిపీర్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఇమామేమౌలాలి గంధోత్సవాన్ని గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి ఒంటి గంటకు పట్టణంలోని పుర వీధుల గుండా పీర్లను ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి, అలాగే గురువారం సాయంత్రం హసనేఆలం, హుసేనీఆలం, ఇమామేఖాసీం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారు. కొడిపీర్ల ఊరేగింపు చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కొడిపీర్ల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కొడిపీర్ల గంధోత్సవంలో భక్తుల ప్రార్థనలు

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

పెబ్బేరు రూరల్: మండలంలోని బుడిదపాడులో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య డాక్టర్ మాధవి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు 250 పశువులకు గాలికుంటు నివారణ నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. 132 ఆవులు, ఎద్దులకు ఎల్ఎస్‌డీ వాక్సినేషన్ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి కొండన్న, పశువైద్య సిబ్బంది నాగమణి, జలీల్, కరుణాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది